

# దారి తెలిసిన వేకువ



చెజ్జెరపు వినోద్ కుమార్

అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు రిజర్వాయర్‌లోని నీటి అలలపై పడి వేనవేలుగా విచ్చిపోతున్నాయి. చల్లని గాలి అప్పుడే మొదలైంది. మిర్చి, టీ బండ్లముందర జనాలు అప్పుడే చిక్కబడుతున్నారు. ఈ రోజు నన్ను పరిపూర్ణంగా ఆవరించిన, ఆక్రమించిన ఆలోచనల సమూహం,దుఃఖ గీతాల కోలాహలం. వీటిని మోసుకుంటూ కూర్చోవడానికి ఇది సరైన స్థలం కాదనిపించింది.

లేచి కొంతదూరంనడిచాను.జనం చాలా తక్కువగా ఉన్నచోట రెయిలింగ్స్ పైన కూచున్నాను.

అక్కడ ఒక వ్యక్తి స్టాండ్‌పైన బుట్టలో ఉడికించిన సెనగలు, బఠానీలు పెట్టుకుని అమ్ముతున్నాడు. అక్కడికి వచ్చే జనాలను చిరునవ్వుతో అతను పలకరించే తీరు ఎంతో బాగా అనిపించింది.

ఒంటరిగాకూచునివున్న నా దగ్గరకు ఎవరో గార్డు వచ్చాడు. 'ఇలా రెయిలింగ్స్‌పైన కూచోవడం ప్రమాదం. అసలేం పనిమీద వచ్చారు' అని అడిగాడు.

నాకు తెలిస్తే కదా అతనికి చెప్పడానికి. జేబులో నుండి ఐ.డి కార్డ్‌తీసి చూపించాను.

అతను వెళ్ళిపోయాడు.

రెండు నెలల క్రితంవరకూ ఆ ఐ.డి. కార్డ్ విలువైనదే. ప్రస్తుతం అది ఓ చిత్తుకాగితం.

మెల్లిమెల్లిగా లైట్ల వెలుగులు ఆక్రమించుకోసాగాయి. రకరకాల వ్యక్తులు... అందంగా తయారై, సరదాగా మాట్లాడుకుంటూ ఎంజాయ్ చేస్తూ... నాకెందుకో వాళ్ళంతా నిరంతర పోరాటయోధుల్లాగా ఈ సరదాలన్నీ వాళ్ళు ఏర్పరచుకున్న కవచాల్లాగా అనిపించాయి. ఇంతలో గార్డు అడిగిన ప్రశ్న గుర్తుకొచ్చింది. 'నేనిక్కడికి ఎందుకొచ్చాను?'

నా స్థితి నాకే గమ్మత్తుగా అనిపించింది.

సరిగ్గా రెయిలింగ్స్ మధ్యలో ఉన్నాను. ఒక్క అడుగు అటు వేస్తే శూన్యం... ఇటు వేస్తే జీవితం... అంతులేని పోరాటాల రణక్షేత్రం.


ఇప్పుడు నన్ను నేను నిలువెల్లా స్పృశించుకోవాలి, విశ్లేషించుకోవాలి, నిర్వచించుకోవాలి, నిర్ణయించుకోవాలి... ఆ తరువాతే మృత్యువైనా, జీవితమైనా. ఇంతలో ఏదో గొడవ మొదలైంది.

సుమారు ముప్పై ఐదేళ్ళున్న వ్యక్తి జీన్స్ టీషర్ట్‌లో ఉన్నతను బఠానీలు అమ్మే వ్యక్తిపై గట్టిగా కేకలు వేస్తున్నాడు, తిడుతున్నాడు. అతనివెంట భార్య, ఐదేళ్ళ వయసున్న కొడుకు ఉన్నారు.

చూస్తుండగానే గుంపు పెద్దదయింది. వెళ్ళి గుంపులో ఒకతన్ని ఏం జరిగిందని అడిగాను.

"ఏంలేదు సార్... పిల్లాడు ఏడిస్తే సెనగలు కొన్నాడు. తీరా పిల్లాడు సగంతిన్నాక చూస్తే అందులో పురుగు కనబడిందట... అదీ గొడవ" అన్నాడు. సెనగలమ్మే వ్యక్తి బతిమాలుతున్నకొద్దీ అతను మరింత రెచ్చిపోతున్నాడు.

"తప్పయింది సార్...చూసుకోలేదు. మంచి సెనగలిస్తాను" దయనీ



● గుర్తింపులేని చిన్న చిన్న పనుల తర్వాతే ఘనవిజయం లభిస్తుంది.

యంగా అడిగాడు సెనగలమ్మే వ్యక్తి.

"తప్పేంట్రా... పిల్లాడికేమయినా అయితే... ప్రాణాలు నువ్వుతెచ్చిస్తావా నా కొ..." అతనిచొక్కా పట్టుకుని ఊపుతూ అరుస్తున్నాడు జీన్స్ వ్యక్తి.

చాలా బ్రతిమాలాడు. అయినా అతను వినడం లేదు. ఇంతలో సర్దిచెప్పే పెద్దమనుషులు ముగ్గురు తయారయ్యారు గుంపులో. అయినా అతను వినడంలేదు. అరుస్తూనేవున్నాడు.

"ఏం సార్... తప్పయిందన్నా వింటలేరు... ఏం కొడతారా?"విసుగ్గా అన్నాడు సెనగలమ్మే అతను. అంతే... అతని చెంప పేలిపోయింది. మరో రెండు దెబ్బలు పడ్డాయి.

బిత్తరపోయాడు సెనగలమ్మే వ్యక్తి. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బనియన్ పైకి లేపి కళ్ళు తుడుచుకుని తిరిగి సెనగలగంప దగ్గరకువెళ్ళి నిలుచున్నాడు. కోపం చల్లబడటంతో జీన్స్‌ప్యాంట్ వ్యక్తి భార్యా పిల్లలతో సిమెంట్‌బెంచిపై కూచుండిపోయాడు.

అంతా ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోయారు.

వాతావరణం ప్రశాంతంగా మారిపోయింది.

మళ్ళీ నా ఆలోచనల సమూహంలోకి దూరిపోయాను... ఏకాంతం తోడుగా.

● ● ●

రెండు నెలలుగా జరుగుతున్న పరిణామాలు నా మనుగడను, నా వ్యక్తిత్వాన్ని నా ముందరే నగ్నంగా పరిచి పరీక్షించుకోమంటున్నాయి.

రెండు నెలలక్రితం నేను పనిచేస్తున్న మల్టీ నేషనల్ కంపెనీ నన్ను ఉద్యోగంలో నుంచి తీసేసింది. ఇది నేనూహించని పరిణామం.

రెసిషన్ పీరియడ్‌లో మా కంపెనీలో కూడా చాలామందిని తీసేస్తున్నారని తెలుసు. కాని వారిలో నేనుండను అని నా నమ్మకం. కానీ టెర్మినేషన్ లిస్టు డిస్‌ప్లే చేసినప్పుడు మొదటి పేరు నాదే.

మూడ్నెల్ల క్రితం జీతం పెంచితేనే వస్తానని ఆఫీసుకెళ్ళలేదు.రెండోరోజే జీతం పెంచి ఆఫీసుకు పిలిచారు. ఇప్పుడు తీసేశారు.

ప్రాజెక్ట్ మేనేజర్‌ను కారణం అడిగాను.

ఇంటలెక్చువాలిటీ, కమిట్‌మెంట్, లాయల్టీ... మూడింటిలో ఏదిలోపించినా ఏ కంపెనీ సహించదు. నీ ఇంటలెక్చువాలిటీ వెనకాల ఆరొగెన్సీ ఉందని, నీ కమిట్‌మెంట్ వెనకాల సెల్ఫిష్‌నెస్ ఉందనేది కంపెనీకి నీ మీదున్న ప్రాథమిక ఇంటలిజెన్స్ రిపోర్ట్. నిజానికి నీ ఆరొగెన్సీ, సెల్ఫిష్‌నెస్‌లతో కంపెనీకి ఏ ప్రాబ్లమ్ లేదు. ఎందుకంటే వ్యాపారానికి ఫీలింగ్స్‌తో సంబంధముండదు.

"విషాదం ఏమిటంటే కంపెనీ ఆల్‌రెడీ పెంచుదామనుకున్న శాలరీనే నువ్వు అడిగావు" అన్నాడు.

ప్యూన్‌ను పిలిచి కాఫీ తెప్పించాడు. ఆఫీసులో చివరి కాఫీ తాగి లేచివస్తుంటే అన్నాడు.

'వ్యవస్థ ఎప్పుడూ తనమీద ఆధారపడివుండే వాడినే పోషిస్తుంది, ఆధిపత్యం చలాయించేవాడిని కాదు. మరో విషాదం ఏమిటంటే నీ గురించి పాజిటివ్‌గా మాట్లాడే వ్యక్తి ప్యానల్‌లో ఒక్కరు కూడా లేరు... నాతో సహా...'

ఆఫీసునుండి బయటకు వస్తుంటే చిరిగిన టికెట్ జేబులో పెట్టుకుని బస్‌దిగి వెళుతున్న ప్రయాణికుడిలా అనిపించింది నాది నాకే. ఆఖరుకు గేట్‌దగ్గర గార్డ్‌కూడా సెల్యూట్‌చేయలేదు.

నా గుర్తింపు నా హోదాతోనే అని అర్థమైంది.

ఇది జరిగి ఇవ్వాల్టికి రెండు నెలలు. మరో ఉద్యోగం దొరకలేదు. చిన్న ఉద్యోగం చేయడానికి మనసొప్పలేదు. లోను కట్టకపోవడంతో ఇంటిని బ్యాంక్ ఆక్షన్‌లో పెట్టింది.

లోనులో తీసుకున్న ఇల్లు, కారు, ఎ.సి. అన్నీ... అన్నీ నాకు ప్రతీకగానే కనిపించాయి. నాకంటూ పరిపూర్ణంగా ఏం మిగిలిందా అని వెతికాను.

అమ్మా, నాన్న, నివేదిత, ఫ్రెండ్స్... వీళ్ళందరితో నాకున్న అనుబంధం ఏమిటనేది నాకర్థంకాలేదు. ఎందుకంటే... ఎందుకంటే... నా ఫీలింగ్స్‌ని వాళ్ళతో పంచుకోవాలని నాకనిపించటంలేదు.

● సమయాన్ని సద్వినియోగం చేసుకునేవారికి మంచి అలవాట్లన్నీ అబ్బుతాయి.



ప్రపంచం అంతా కూడా ఎన్నోసార్లు మనకు దగ్గరవ్వాలని ప్రయత్నిస్తూంటుంది. కనీసం ఒక్కసారైనా దాని ఆహ్వానాన్ని అంగీకరించాలి. ఆమోదించాలి... కానీ...

చిన్నప్పటి నుండి నా చుట్టూ నేను ఇటుకమీద ఇటుక పేర్చుకుంటూ కట్టుకున్న గోడలు నన్ను ఊపిరాడకుండా చేస్తున్నాయి. నాతో నేను ఎన్ని భావాలనని షేర్ చేసుకోగలను?

ఈ రోజు ఉదయం నివేదిత జాబ్‌లో జాయినైంది. మధ్యాహ్నం చేతననుండి ఫోన్... అది ఇప్పుడు గ్రూప్-I ఆఫీసర్.

"చేతూ చెప్పవే" అన్నాను ముక్తసరిగా.

"గోపీ జాబ్‌కు రిజైన్ చేశాడ్రా" అంది.

"ఎందుకు?"

"చేసే పనిలో సేవ ఉండాలి... మనుషులతో సంబంధం కలిగివుండాలట... అందుకే వదిలేశాడు" ఈరోజు మరీ విషాదంగాఅనిపించింది.

నా ఉద్యోగం పోయినప్పుడు నివేదిత కళ్ళల్లో తిరస్కారాన్ని చూశాను. గోపీ జాబ్ వదిలేస్తే చేతన ఆక్సెప్ట్ చేస్తుంది. చేతన జాబ్‌లో జాయినైతే ఆ ఆనందాన్ని గోపీ సెలబ్రేట్ చేసుకున్నాడు.

నివేదిత జాబ్‌లో జాయినైతే నేనేమో ఓటమి భారం మరింత పెరిగినట్లు ఫీలవుతున్నాను.

'ఎదుటివారి విజయం నా ఓటమి ఎలా అవుతుంది?' మొదటిసారి నేను కొత్తగా ఆలోచించడం మొదలుపెట్టానేమో? గోపీ అంటే నాకు మొదటి నుండీ ద్వేషమే... వాడు నా క్లాస్‌మేట్. వాడు నిరంతరం నన్ను నీడలా అంటుకునివుండే నిశ్శబ్ద ప్రశ్నల సమూహం. నా అన్ని ఫీలింగ్స్‌నూ తనలోకి లాక్కోవాలని చూసే బ్లాక్ హోల్.

● ● ●

చదువుకునే రోజుల్లో గోపీకి, నాకే పోటీ.

నాదెప్పుడూ ఫస్ట్‌ర్యాంక్, వాడిదెప్పుడూ సెకండ్ ర్యాంక్. క్లాస్ మొత్తానికి ఎప్పటికీ నేనే ఫస్ట్‌ర్యాంక్‌లో ఉండాలనేది నా ఆశయం. దానికోసం నేను రాత్రింబగళ్ళు కష్టపడి చదివేవాడిని.

గోపీకి టాప్‌ర్యాంక్ అనేది అసలు ఆశయమే కాదు. దానికోసం వాడు ఏమాత్రం శ్రమపడేవాడు కాదు. మార్కుల్లో మాత్రం దాదాపుగా నాతో సమానంగా ఉండేవాడు. నన్ను అందరూ మెచ్చుకునేవారు. వాడిని అందరూ ఇష్టపడేవారు.

రెండింటి మధ్య హస్తి మశకాంతరం ఉంది.

మెచ్చుకోవడానికి ప్రాతిపదికలు, ప్రమాణాలు ఉన్నాయి. కాని ఇష్టపడడానికి ప్రాతిపదికలు, ప్రమాణాలు ఏంటో నాకిప్పటివరకూ తెలియదు.

నాకే కాదు, బహుశా గోపీకి కూడా తెలియదు అనుకుంటా. ఒకే ఒకసారి గోపీకి ఫస్ట్‌ర్యాంక్ వచ్చింది ఫోర్త్ సెమ్‌లో.

అది కూడా నాకన్నా రెండే మార్కులు ఎక్కువ. గోపీమొహంలో ఎలాంటి మార్పూ లేదు. అసలు వాడు ఫెయిల్ అయినాకూడా వాడి మొహం అలాగే ఉంటుందేమో అనిపించింది. వాడు ఫీలింగ్స్‌నూ మోసుకుంటూ తిరగడు.

కాలేజీ నుండి మధ్యలోనే వెళ్ళిపోయాను. రాతిరంతా నిద్దురపోలేదు. మరో సెమిస్టర్ వరకూ ఈ

## వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది



విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలు, విధ్వంసమవుతున్న మధ్యతరగతి జీవన శైలి ఇష్టమయిన కథా వస్తువులు.

స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ- రామంతాపూర్, హైదరాబాద్ నందు స్క్రిప్ట్ రైటర్‌గా ఉద్యోగం.

అనిల్ అవార్డ్ కథల పోటీలో నా కథ 'దారి తెలిసిన వేకువ'కు బహుమతి రావడం నాకెంతో ఆనందంగా ఉంది. స్వాతి సచిత్ర మాసపత్రిక కథల పోటీల్లో బహుమతి రావడం మూడోసారి.

అత్యుత్తమ సాహిత్యాన్ని నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహించే 'స్వాతి'కి కృతజ్ఞతలు.

బెజ్జారపు వినోద్‌కుమార్



Scanned by CamScanner

● దుష్టులతో స్నేహం చేయడం కన్నా ఒంటరితనం మంచిది.

భారాన్ని మోస్తూనే తిరగాలి గోపీపైన కసి. కానీ మర్నాడు చిన్న మిరకిల్ జరిగింది.

క్లాస్‌రూమ్‌లో ఆన్సర్ స్క్రిప్ట్స్ ఇచ్చి సరిచూసుకోమంటారు (మాది అటానమస్ కాలేజీ).

తన ఆన్సర్ స్క్రిప్ట్ ప్రొఫెసర్‌కు చూపించి తనకు ఐదు మార్కులు పొరపాట్న ఎక్కువ వచ్చాయని చెప్పాడు గోపీ. అంతా ఆశ్చర్యపోయారు.

నేనైతే ఎంతో ఉత్కంఠకు లోనయ్యాను.

ప్రొఫెసర్ గోపీ ఆన్సర్ స్క్రిప్ట్‌ను చెక్‌చేసి ఐదు మార్కులు తగ్గించాడు. జీవితంలో పెద్ద ఓటమి నుండి బయటపడ్డానన్న ఫీలింగ్. కానీ... ఎందుకో... నేను పొందిన మార్కులకన్నా వాడు కోల్పోయిన మార్కులనే గొప్పగా భావించారంతా. నేనుతప్ప.

వాడు నాకు ఎప్పటికీ అంతుచిక్కని రహస్యం... ఏ ఆకారంలోనూ పర్మినెంట్‌గా కనిపించని రా మెటీరియల్. వాడి అలవాట్లు, ఆలోచనలు అన్నీ భిన్నంగా ఉండేవి. వాడి మాటలకు, వాడి ప్రపోజల్స్‌కు, వాడి నిర్ణయాలకు అందరూ మంత్రముగ్ధులైపోయేవారు ఫాకల్టీతో సహా...

ఒకసారి అజంతా ఎల్లోరా టూర్‌కు వెళ్ళాం.

ఎల్లోరా కేవ్ నెం. 15లో కైలాస్ టెంపుల్ ఏకశిల లోంచి చెక్కిన మహాద్భుతమైన శిల్పసంపద.

ఒకచోట గోడలపై శివపార్వతుల కళ్యాణ ఘట్టాలు శిల్పాలరూపంలో చెక్కబడివున్నాయి.

అందులో శివపార్వతుల పాణిగ్రహణం శిల్పం ఉంది. శివుని చేతిలో పార్వతీదేవి పాణిగ్రహణం చేస్తున్నట్లుగా కాకుండా శివుని అరచేయిపైన తన అరచేతిని ఉంచినట్లుగా ఉంది.

దానిని చూపిస్తూ గైడు... "చూశారా దొంగపెళ్ళి చేసుకుంటున్నానన్న భయంలో తన తండ్రి దక్షుడు ఎక్కడ వచ్చి అడ్డుచెబుతాడోనన్న ఖంగారులో పొరపాటున శివుని అరచేతిలో తన అరచేయిని తప్పుగా పెట్టింది. అందుకే పార్వతి సిగ్గుతో ఎలా తలదించుకుందో చూడండి" అన్నాడు.

అతని వివరణ చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. అప్పటివరకు నిశ్శబ్దంగా వింటూనేవుండిపోయిన గోపీ బస్‌లోకి వచ్చాక చెప్పాడు.

"కళాపోషణ రాజుల స్టేటస్ సింబల్. ఏకశిలలో నుంచి ఇంత గొప్ప శిల్పసంపద చెక్కేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే సరిదిద్దడానికి వీలుండదుకాబట్టి. ఆ పొరపాటుచేసినందుకు ఆ శిల్పిని రాజు ఎంత తీవ్రంగా శిక్షించి వుంటాడో" చెబుతుంటే గోపీమొహంలో బాధ కనిపించింది.

వాడి ప్రతి ఆలోచనా అంతే భిన్నంగా ఉంటోంది. వాడి ప్రతి చర్యలోనూ చైతన్యం తొణికిసలాడేది. వాడెక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం పురివిప్పుకుని నాట్యంచేసేది.

సామాజిక సమస్యలపై సెమినార్లు, మీటింగులు జరుగుతుంటే, అందరూ ఉపన్యాసాలు ఇస్తుంటే వాడక్కడ కనబడకపోయేది. పాల్గొనకపోయేది.


తన స్టైఫండ్‌లోంచి సగం డబ్బులు మానసిక వికలాంగుల ఆశ్రమానికి ఇచ్చేసేవాడు. తనకు అన్యాయం అనిపించిన ప్రతివిషయంలో దూరిపోయేవాడు. ఒకసారి దారిలో యాక్సిడెంట్ అయి గిలగిలా కొట్టుకుంటున్నవాడిని స్వయంగా మోసుకెళ్ళి అంబులెన్స్‌లో ఎక్కించి హాస్పిటల్‌కు వెళ్ళి, వాళ్ళ సంబంధీకులు వచ్చేవరకు ట్రీట్‌మెంట్ ఇప్పించి కాలేజీకి వచ్చాడు. దానికోసం ఆ రోజు తన ల్యాబ్ ఎగ్జామ్ వదులుకున్నాడు.

ఎగరాలనిపిస్తే ఎగిరేవాడు. సిగరెట్ తాగాలనిపిస్తే ఫాకల్టీ ముందైనా తాగేవాడు. ఎంత ఫోర్స్ చేసినా మందు తాగకపోయేవాడు.

దేశంలోని రకరకాల ప్రత్యేకావసరాలు ఉన్నవారికి ఉచితంగా సేవలందించే ఎన్నో సంస్థల, వ్యక్తుల అడ్రస్‌లు, ఫోన్‌నెంబర్‌లు, మెయిల్ ఐడీలు వాడి దగ్గర ఉండేవి. సమస్య శారీరకమైనా, మానసికమైనా, ఆర్థికమైనా...వాడి దగ్గర పరిష్కారమార్గమున్నట్లే అనిపించేది. "ఏంట్రా... నువ్వు చేసే పనులతో

● కొండను కదిలించాలంటే ముందు కొన్ని చిన్నరాళ్ళను పైకెత్తాలి.





ఈ సమాజమూ, మనుషులూ మారతారా? ఎంత మందినని మారుస్తావు?" అడిగానొక రోజు.

చిన్నగా నవ్వి చెప్పాడు. "మార్పు అనేది ఒక వ్యక్తి చేతనో, ఒక సంఘటన చేతనో జరిగేది కాదు. ఒక క్షణంలోనో ఒక రోజు లోనో జరిగేది కాదు.

మార్పు అనేది ఒక సుదీర్ఘ ప్రక్రియ. లెక్కలేనన్ని అనుభవాల, అనుభూతుల, సంఘర్షణల తుది ఫలితం. ప్రపంచంలో అత్యంత మూర్ఖమైన పని ఎదుటివారిని మార్చాలనుకోవడమే"

"మరి నిన్నుకూడా కాదనుకుని ఎందుకింత తపన?" అడిగాను.

"నన్ను కాదనుకున్నానా? ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాడు. నా దగ్గర సమాధానం లేదు. ఎందుకంటే... ఇప్పటివరకూ వాడు బాధతో ఉండడంగానీ, మూడీగా ఉండడంగానీ చూడలేదు.

వాడిలాగే ఉండే మరో వ్యక్తి చేతన.

అచ్చు వాడికి జిరాక్స్ కాపీలాగే అనిపిస్తుంది.

చిన్నప్పుడు పోలియో సోకడంతో ఒక కాలు పీలగా ఉంటుంది. కుంటుతూ నడుస్తుంది.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో నాకు ఒక కంపెనీలో జాబ్‌వస్తే, గోపీకి, చేతనకు మరో కంపెనీలోవచ్చింది. డిగ్రీ పూర్తవకముందే ఉద్యోగం రావడం నాకు ప్రపంచాన్ని జయించినంత సంతోషాన్నిచ్చింది. గోపీమాత్రం దానిని అతిసాధారణ సంఘటనలా తీసుకున్నాడు. చేతనమాత్రం ఆ ఉద్యోగం చేయనని చెప్పేసింది.

దానికి గ్రూప్‌వన్ సర్వీసెస్ అంటే ఇష్టం. జాబ్‌లో జాయినయిన రోజు సాయంత్రం ఇంటికొచ్చాడు గోపీ. తరచూ మా ఇంటికి వస్తుంటాడు వాడు. రాగానే కాఫీతాగుతూ అమ్మతో చెప్పాడు.

"నాకు చేతూ అంటే చాలా ఇష్టం అమ్మా... ఐ వాంట్ టు మారీ హర్"

వాడి అప్రోచ్‌కు షాకయ్యాను...కానీ వాడు చేతనను పెళ్ళిచేసుకుంటానని ప్రపోజ్‌చేయడం నాకెందుకో నచ్చింది. ఎందుకంటే వాడు జీవితాంతం ఒక అవిటిదానిని తన వెంటేసుకుని తిరగాలి.

గోపీ ప్రపోజల్‌కు అమ్మ చిన్నగా నవ్వింది. నాన్న

## డిప్రెషన్ తగ్గించే కాఫీ

దిగులుగా, డిప్రెస్డ్‌గా వుంటే ఓ కాఫీకప్పు చేత్తో పట్టుకుంటే సమస్య తీరినట్లే. ఇది కాఫీ ప్రేమికులకు శుభవార్తే. రోజులో నాలుగైదు కప్పుల కాఫీ తాగేవారు మిగతావారితో పోల్చితే పదిశాతం తక్కువ డిప్రెస్ అవుతుంటారు.

రోజుకు కేవలం రెండు, మూడు కప్పుల కాఫీ తాగినా పెర్క్‌లు అందినట్లే. దానిలోని కెఫైన్‌వల్ల మాత్రమే కాఫీ ఈ ప్రయోజనాన్ని ఇస్తుందనుకోకూడదు. డిప్రెషన్ నుంచి రక్షణ అనే సూత్రం మిగతా కెఫైన్ పానీయాలకు వర్తించదు.

నిజానికి ఎక్కువ డిప్రెషన్ రిస్కుతో లింకయివున్న అనేక తీపి పానీయాల్లో కోలా వుంటుంది. ఆర్టిఫీషియల్ స్వీటనర్లుగల పానీయాల్లో ఈ రిస్కు మరీ ఎక్కువ.

కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్స్‌వల్లే దానికి మూడ్ లిఫ్టింగ్ గుణాలున్నట్లు పరిశోధకులు గుర్తించారు. రెగ్యులర్‌గా కాఫీ తాగేవారిలో అల్జీమర్స్ వ్యాధి రావడం నెమ్మదిస్తుందని, టైప్ 2 డయాబెటిస్ నుంచి పరిరక్షిస్తుందని కూడా పరిశోధకులు గుర్తించారు. ◆

**● ఎదుటివ్యక్తిని మాట్లాడనివ్వనంత మాత్రాన మీదారికి తెచ్చుకున్నట్లుకాదు.**

కళ్ళలోనుండిమాత్రం నీళ్ళు జలజలా రాలాయి.

వాడు వెళ్ళిపోయాక నాన్నను అడిగాను.

"ఎలా అవుతుందో అనుకున్న చేతూ పెళ్ళి మంచినీళ్ళు తాగినంత ఈజీగా అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది కదా నాన్నా" అని.

"ఇంకా చేతూ అభిప్రాయం ఏమిటో తెలీదు కదరా!" అన్నాడు నాన్న. నేనాశించినదానికి విరుద్ధమైన సమాధానంరావడంతో నా అహం దెబ్బతింది.

"వాడొక అనాథ... ఆ విషయం మీకు కూడా తెలుసు" అన్నాను కోపంగా.

"మానవసంబంధాల విషయంలో నువ్వింకా తాతలనాటి కాలంలో ఉన్నావు"అన్నాడు సౌమ్యంగా.

మర్నాడు గోపీని సీరియస్‌గా అడిగాను.

"ఏరా! చేతూను పెళ్ళిచేసుకోవడం పెద్ద త్యాగమనుకున్నావా?" అని వాడు నా మాటలకు ఆశ్చర్యపోయాడు.

"త్యాగం ఏంట్రా? నాకర్థం కావట్లేదు. చేతూ ఒప్పుకుంటుందో లేదో అనినేను ఎదురుచూస్తుంటే" చేతనపట్ల నా ఆలోచన, వాడి ఆలోచన పూర్తిగా భిన్నంగా ఉన్నాయనిపించింది. నెల తిరిగేలోపు నాకు నివేదితకు, గోపీ చేతనలకు పెళ్ళి జరిగింది.

నేను కాలంతో పోటీపడి పరుగెత్తాను. విపరీతంగా శ్రమించాను. ఎందుకంటే నేను కంపెనీ నుండి ఎక్కువ ప్రతిఫలాన్ని ఆశించాను కాబట్టి.

గోపీ ఏనాడూ శ్రమపడ్డట్టు కనిపించలేదు. కాని వాడి ప్రాజెక్టులు సకాలంలో పూర్తయేవి.

గోపీకి వాళ్ళ ఆఫీసులో ప్రాజెక్ట్ మేనేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. అందులో జాయిన్ అయ్యేకన్నా ముందే వాడు రిజైన్ చేశాడు. వాడు రిజైన్ చేసేంత వరకూ ఎవరికీ తెలియదు... చివరకు చేతనకు కూడా. చేతన ఇప్పుడు గ్రూప్ వన్ ఆఫీసర్. ఆర్.డి.ఓ.గా ప్రొబేషనరీ పీరియడ్‌లో ఉంది.

నన్ను ఉద్యోగంలోంచి తీసేయడం, గోపీ తన ఉద్యోగానికి రాజీనామా చేయడం రెండూ పరస్పర విరుద్ధమైన చర్యలు.

ఉద్యోగం పోయాక నేను నా జీవితాన్నే కోల్పోయినట్లుగా ఫీలవడం, ఉద్యోగాన్ని వదిలేశాక గోపీ తన జీవితాన్ని పునర్బలనం గావించుకున్నట్లుగా ఫీలవడంలో అంతరం ఏమిటో నాకే మాత్రం తెలియడం లేదు. గోపీలోని నిరంతర చైతన్యానికి, నాలోని పరాకాష్టనొందిన స్తబ్ధతకు మూలాలెక్కడున్నాయో నాకు తెలియడంలేదు.

చేతూను చేసుకుంటానని వచ్చినప్పుడు వాడిని అనాథ అని తిట్టాను. కాని ఇప్పుడు వాడికి ప్రపంచమంతా కుటుంబమే.... కాని నాకు మాత్రం అమ్మా, నాన్న, చేతన చివరకు నివేదితతో సహా అందరూ పరాయివాళ్ళుగానే అనిపిస్తున్నారు.

ఇప్పుడు...ఇక్కడ... ఈ క్షణంలో నిజమైన అనాథలా నిలబడివున్నాను నేను.నా జీవితాన్ని ఈక్షణం నుండి పునర్నిర్మించుకోవాలి. కానీ ఎలాగో తెలియడం లేదు.... ఎవరైనా చెబితే బాగుండు...

• • •

ఏదో కలకలం... విపరీతమైన అరుపులు, కేకలు, ఆర్తనాదాలు. హఠాత్తుగా ఆలోచనల్లోంచి బయట కొచ్చాను. పార్కులో రెయిలింగ్‌పైన నేను అలాగే కూచునివున్నాను. కానీ... ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి షాకైపోయాను.

ఇందాక సెనగలమ్మే వ్యక్తితో గొడవపెట్టుకున్న జీన్స్‌ప్యాంట్ వ్యక్తి కొడుకు ఐదేళ్ళ పిల్లాడు రెయిలింగ్ కిందనుండి దూరి వెళ్ళి రిజర్వాయర్ అంచులో నిలబడివున్నాడు.

అందరి అరుపులకు అప్రమత్తమైన ఆ పేరెంట్స్ పరుగెత్తి వచ్చేలోపలే ఆ పిల్లవాడు లోతైన రిజర్వాయర్‌లో పడిపోయాడు. లైట్ల వెలుతురులో ఆ పిల్లవాడు గిలగిలాకొట్టుకోవడం లీలగా కనిపిస్తోంది.

ఆ ప్రాంతమంతా అరుపులతో ఆర్తనాదాలతో నిండిపోయింది. నాకు క్షొద్దో గొప్పో ఈత వచ్చు. కానీ దూకలేదు. ఆ కొన్ని సెకన్లలోనే నాలో ఎన్నో

**● ఓడిపోతామనే భయంకంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.**

## మహిళల్లో నలభై దాటాక

ఇరవైల్లో, ముప్ఫయ్‌ల్లో యవ్వనం తాలూకు ఆనందాలు తొణికిసలాడొచ్చునేమో కాని, మహిళలు ఐదో దశాబ్దంలోకి అడుగుపెట్టాక మరింత సంతోషంగా, ఉత్సాహంగా ఉంటారు.

నలభైలలో ఆరోగ్యసమస్యలు ఆరంభమై ఉత్సాహం తగ్గనారంభిస్తుందని చాలామంది అనుకుంటుంటారు కాని ఇది నిజం కాదు.

మహిళలకు జీవితంలోని ఆనందాలు నలభైల్లోనే మొదలవుతాయి. శృంగార జీవితమూ సంతృప్తిగా ఉంటుంది.

నిజం చెప్పాలంటే మానసిక పరిణతి చక్కగా ఉండి, పదేళ్ళు వెనక్కి వెళ్ళినట్లు ఫీలవుతారని పరిశోధనలు చెప్తున్నాయి.

ఇందుకు అనేక కారణాలు దోహదంచేస్తాయి. ఆర్థిక సుస్థిరత, స్థిరమైన సంబంధబాంధవ్యాలు, భద్రతాభావం, చక్కని డ్రెస్ సెన్స్‌వంటి ఎన్నో కారణాలు ఉంటాయి.

అందుకే వయస్సు నలభైలు దాటివెళ్తున్నా మనస్సు ముప్ఫయ్‌ల్లోకి వెళ్ళిపోతుంటుంది. ◆




రీజన్స్.... ఎన్నో ఆలోచనలు. అందరూ అలా చూస్తుండగానే పరుగెత్తుకుంటూ వచ్చి రిజర్వాయర్‌లోకి దూకాడు సెనగలమ్మే వ్యక్తి. పేరెంట్స్ ఏడుపు తప్ప అంతా నిశ్శబ్దంగా మారిపోయింది.

కొన్ని క్షణాల్లోనే పిల్లాడిని తీసుకుని కొంత దూరం ఈతకొడుతూ వెళ్ళి మెట్లపైనుండి పైకి వచ్చి బాబును తల్లిదండ్రులకు అప్పగించాడతను. అందరూ అతడిని ఓ దేవుడిలా చూస్తున్నా అతనిలో ఏ భావమూ లేదు. అసలు తాను ఒక గొప్ప పని చేశానన్న ఫీలింగే అతనిలో కనబడలేదు.

పిల్లాడి తండ్రి డబ్బులిస్తాననడం, అతను తిరస్కరించడం, అందరూ అతన్ని మెచ్చుకోవడం లాంటి సంఘటనలన్నీ అరగంటలో పూర్తయ్యాయి. పిల్లాడిని తీసుకుని వెళుతూ ఆ తల్లి హఠాత్తుగా వంగి అతని పాదాలకు నమస్కరించి వెళ్ళి కారులో కూచుంది. కారు వెళ్ళిపోయింది.

జనమంతా వెళ్ళిపోయారు. అతను తన షర్ట్‌ను విప్పి పిండి మళ్ళీవేసుకుని సెనగలు అమ్మే స్థలంలో నిలబడ్డాడు. అక్కడ నేనూ అతనూ ఇద్దరమే మిగిలాం. మెల్లిగా అతనిదగ్గరకు నడిచాను. "ఏం సార్ సెనగలుకావాలా?"అడిగాడతను మామూలుగా.

"ఏమయ్యా ఇంతకుముందే నిన్ను అతడు కొట్టాడు కదా! వాళ్ళ బాబును రక్షించడానికి దూకేటప్పుడు నీకేమీ అనిపించలేదా?" అడిగాను.

నా ప్రశ్నకు అతను ఎంతో ఆశ్చర్యపోయాడు.

"అదేంటి సార్...నాకప్పుడు ఆ పిల్లాడ్ని కాపాడాలని మాత్రమే అనిపించింది. ఇంకేమీ అనిపించలేదు" అన్నాడు నాకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

గట్టిగా కౌగిలించుకున్నానతడిని. నా జీవితం యొక్క పునర్నిర్మాణం అప్పుడే మొదలయింది. అతని బట్టల తడి నాకంటుకుని నన్ను తడపసాగింది. ఇన్నాళ్ళూ గోపీ చెప్పని సమాధానాన్ని అతను చెప్పకనే చెప్పాడు.

అతను తనకు ఏదైతే చేయాలని అనిపించిందో అదే చేశాడు. సమాజమూ, నేపథ్యమూ, ప్రక్రియలు, పరిణామాలు, పర్యవసానాలు, లాభాలు, నష్టాలు, తర్కమూ, కారణమూ, భయమూ... దేనిలోనూ, దేనితోనూ అతను తన మనసును బంధించలేదు. వచ్చి కారులో కూచున్నాను.నివేదిత, అమ్మా, నాన్న, చేతన, గోపీ, కొలీగ్స్, ఆఫీస్...అంతా అంతా ప్రేమమయమైపోయినట్లుగా అనిపించింది. ◇◇





Scanned by CamScanner